క్లుప్తంగా

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



జాగ్రత్తలను వివరిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ అనుపమ జేమ్స్

కూడేరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ అనుపమ జేమ్స్ సూచించారు. శనివారం మండలంలోని కుష్ఠు రోగుల కాలనీలో వైద్యాధికారులు అంగవైకల్య నివారణ పునరావాస శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ అనుపమ జేమ్స్ పాల్గొన్నారు. కుష్ఠు రోగుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులమని ఆందోళన చెందుతూ ఒత్తిడికి గురికావద్దని సూచించారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తిస్తే మందులతో పూర్తిగా నయం చేయొచ్చన్నారు. పీఎంఓ నాగన్న, డీపీఎంఓ మరియదాస్, సూపర్ వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, ఏఎన్ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉషారాణికి సన్మానం



ఉషారాణిని సన్మానిస్తున్న దృశ్యం

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎంపికైన ఉషారాణిని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సన్మానించారు. అనంతపురం టమోట మండీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బోనగిరి మహానందరెడ్డి, కాలువపల్లి సర్పంచు గురుస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, మహేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్, పెద్దన్న, ఆనంద్‌రెడ్డి, ఖాదర్‌బాషా గజమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కామ్రేడ్ వెంగమనాయుడుకు నివాళి



వెంగమనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

కూడేరు: స్థానిక మండల కేంద్రంలో కామ్రేడ్ వెంగమనాయుడు వర్ధంతి వేడుకలు శనివారం నిర్వహించారు. వెంగమనాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పేదల కోసం వెంగమనాయుడు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, మండల కార్యదర్శి నాగేంద్ర, ఏఐటీయూసీ జిల్లా నేత రాజుకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కామ్రేడ్ వెంగమనాయుడు ఆశయాలు కొనసాగిద్దామని నియోజవర్గ కార్యదర్శి గోపాల్, సహాయ కార్యదర్శి నరసింహులు అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కామ్రేడ్ వెంగమనాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం నవజ్యోతికి ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం నవజ్యోతి

వజ్రకరూరు: వెంకటాంపల్లి సచివాలయం ఏఎన్ఎం నవజ్యోతికి ఉత్తమ సేవా అవార్డు దక్కింది. వెంకటాంపల్లిలో ఏఎన్ఎం మాతాశిశు సంరక్షణ కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలు ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం, తదితర మెరుగైన సేవలు అందించారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాంపల్లి ఏఎన్ఎంను ఉత్తమ ఏఎన్ఎం అవార్డుకు ఎంపిక చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో అవార్డు, ప్రశంసాపత్రం అందించారు. వైద్యాధికారులు తేజశ్వి, సర్దార్‌వలి, సీహెచ్ఓ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్ వైజర్లు సుశీల, నాగశంకర్, వైద్యసిబ్బంది అభినందించారు.

వైఎస్సార్‌సీపీ నాయకురాలు మృతి

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ డీలర్ నారాయణరెడ్డి మాతృమూర్తి బాసాల రుద్రమ్మ (85)అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులకు నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఫోన్ ద్వారా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రుద్రమ్మ మృతదేహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ప్రాచీన కళా సంపద .. కళావిహీనం

- గుప్తనిధుల వేటలో కనుమరుగవుతున్న చారిత్రక కట్టడాలు
- నిద్రమత్తులో కేంద్ర పురావస్తుశాఖ అధికారులు
- తవ్వకాలతో ధ్వంసమవుతున్న పురాతన విగ్రహాలు, ఆలయాలు



కొండపై వెలసిన ప్రాచీన మాధవరాయుని ఆలయం



దుండగుల చర్యలకు ధ్వంసమైన శ్రీమాధవరాయుని మూలవిరాట్ (ఫైల్)

రాయదుర్గంటౌన్: పురాతన ఆలయాలు గుప్తనిధుల వేటగాళ్ల చర్యలు ఫలితంగా క్రమంగా కనుమరుగవుతున్నాయి. గుప్త నిధులు లభ్యమవుతాయన్న అత్యాశతో రాయదుర్గం కొండపై కొందరు దుండగులు చేస్తున్న తవ్వకాలతో విజయనగర రాజుల సంస్కృతి చిహ్నాలుగా ఉన్న ప్రాచీన కళా ఖండాలు ధ్వంసమవుతున్నాయి. దుండగుల చర్యలకు విగ్రహాలు, ఆలయాలు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి.

రాయదుర్గం కొండపై చిన్న, పెద్ద గుట్టలతో కూడుకొని దాదాపు 1150 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ ఎల్లమ్మ కొండ, సిద్ధుల కొండ, గట్టిమల్లప్ప కొండ, అడుగుప్ప, లింగా బండ, నరసింహస్వామి కొండపై శిల్ప కళాసౌందర్యంతో ఆలయాలు దర్శనమిస్తున్నాయి. కానీ కొందరు స్వార్థపరుల వల్ల ప్రసిద్ధి చెందిన ఆలయాలు ధ్వంసమవుతున్నాయి. పర్యాటక కేంద్రంగా రాయదుర్గం కొండను అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నా దేవదాయశాఖ, పురావస్తుశాఖ అధికారులు పట్టించుకోలేదని మేధావులు, చరిత్రకారులు చెప్తున్నారు. కొండపై పురాతన ఆలయాలు, కట్టడాలు, కోటలు, సమాధులు, మసీదులు, బావులు, శాసనాలు, కొలనుల్లో విలువైన సంపద ఉంటుందన్న ఆశతో చరిత్రలో సజీవ సాక్ష్యాలుగా ఉన్న కట్టడాలను రాత్రికి రాత్రే గుప్త నిధుల వేటగాళ్లు ధ్వంసం చేశారు. ఇప్పటికే నామరూపాల్లేకుండా చేశారు.

కొండపై నాలుగు ఆలయాల్లో తవ్వకాలు:

కొండపై వీరభద్రస్వామి, శివాలయం, సీతారామ ఆలయంతోపాటు ఎల్లమ్మకొండ మాధవరాయస్వామి ఆలయం వెనుక ప్రాకారపు గేటు సమీపంలో తాజాగా గత జూన్ మాసంలో ధ్వజస్తంభం వద్ద తవ్వకాలు చేశారు. ఐదారేళ్ల క్రితం కూడా కొండపై ప్రాచీన ఆలయాల్లో గుప్త నిధుల కోసం యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టిన సందర్భాలున్నాయి. పురావస్తుశాఖ అక్కడక్కడ కొన్ని బోర్డులను ఉంచి, వాచ్‌మెన్‌ను నియమించినా తరచూ తవ్వకాలు జరుపుతున్నారు. ధ్వజ స్తంభాలను సైతం కూలుస్తున్నారు. అనంతపురం, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం, కర్ణాటకలోని చిత్రదుర్గం, బళ్ళారి, హొస్పేట నుంచి అనేక మంది దుండగలు గుప్త నిధుల కోసం వస్తున్నట్లు సమాచారం. ఇటీవల లింగాలబండలో చతుర్ముఖ పశుపతినాథుని విగ్రహాన్ని ధ్వంసం చేశారు.

ధ్వంసమవుతున్న ప్రాచీన ఆలయాలు :

గుప్తనిధుల వేటలో రాయదుర్గం కొండపై గతంలోనే ప్రాచీన ఆలయాలైన మాధవరాయ స్వామి ఆలయంలోని స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఆలయం ఎదురుగా మహమ్మదీయుల సంస్కృతిని చాటే భవనాలను ధ్వంసం చేశారు. వీరభద్రస్వామి ఆలయం 80 శాతం శిథిలమై పూర్తిగా భూమిలోకి కూరుకుపోయింది. గర్భగుడిలోని పీఠాలు, బండలను పెకలించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఏనుగులబావి వద్దనున్న నరసింహ స్వామి ఆలయ ధ్వజ స్తంభాన్ని పడగొట్టారు.

పురావస్తు సందపను పరిరక్షించాలి



చారిత్రక కట్టడాలు, పురావస్తు సంపదను పరిరక్షించాలి. విజయనగర చక్రవర్తుల కాలం నాటి పురాతన కట్టడాలను స్వార్థపరులు ధ్వంసం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ చర్యలు తీసుకోలేదు. పురాతన కళాసంపద ధ్వంసం కాకుండా చర్యలు తీసుకోవాలి. అనుమానస్పద వ్యక్తులను విచారించాలి. శిథిలావస్థకు చేరిన ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

– గుడేకోట శివకుమార్, హెరిటేజ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, రాయదుర్గం



వీరభద్రస్వామి ఆలయంలో బండలను పెకిలించిన దృశ్యం



శివాలయంలోని గర్భగుడి పీఠాన్ని సైతం పెకెలించిన దుండగులు



పర్యవేక్షణ, సంరక్షణ లేక శిథిలావస్థకు చేరుకున్న ప్రాచీన కట్టడం

స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలి



శాంతినగర్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ప్రజలపై భారం వేసే విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక శాంతినగర్‌లో పార్టీ నాయకులు, ప్రజలతో కలిసి విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మధు, తిమ్మరాజు, ఓబులేసు, బాబు, సూరి, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోండి

ఉరవకొండ: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా అడ్డుకోవాలని సీపీఎం నాయకులు, కౌలు రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దు.. ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలనే కరపత్రాలను సీపీఎం, కౌలు రైతు సంఘం నాయకులు ఇంటింటికీ వెళ్లి అందజేసి, ప్రచారం చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి పెద్దముష్టూరు వెంకటేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపు ధోరణి వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: బాధ్యతాయుత పదవిలో ఉన్న కూటమి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బెదిరింపు ధోరణితో మాట్లాడడం సరికాదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్లు ఈడిగ సుధీర్, గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, హనుమంతురాయుడు, వెంకటప్ప, చంద్రశేఖర్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కొత్తూరు పంచాయతీలో పర్యటించిన ఎమ్మెల్యే.. మీడియా ముందు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, పార్టీ నేత ఉమాను ఉద్దేశించి ‘మీ ఇంటికొస్తా.. మీ నట్టింటికి వస్తా, నాకు భయంలేదు’ అంటూ.. సినిమా డైలాగులు చెప్పినంత మాత్రాన వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరూ భయపడరని అన్నారు. ప్రజలు అధికారం ఇచ్చింది బెదిరించడానికి కాదని, ప్రజా సేవ చేయడానికి అన్నారు. మీకు చిత్తశుద్ధి ఉంటే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి భైరవానితిప్పకు నీరు ఇచ్చే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ బెల్టుషాపులు ఏర్పాటు చేసి, విచ్చలవిడిగా అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్నారని, రాష్ట్రంలో సంచలనం రేపిన ఈ స్టాంప్ కుంభకోణంలో సూత్రదారులు ఎవరో ప్రజలకు తెలుసునన్నారు. కేవలం ఉనికి కాపాడుకోవడానికి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్షన్న, పరమేశ్వరప్ప, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సత్తి, నాయకులు బిక్కి హరి, బోరంపల్లి రామిరెడ్డి, చరణ్, ప్రతాప్, దొడగట్ట మురళి, గూబనపల్లి నాగరాజు, పాతలింగ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఆరుబయటే మధ్యాహ్న వంట



ఉరవకొండలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఆరుబయటే వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకురాలు

ఉరవకొండ: స్థానిక 4వ వార్డు లాలుస్వామి గుడి వద్ద ఉన్న ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలో పిల్లలకు ఆరుబయటే మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. ఆరుబయటే వంట వండుతుండడంతో దుమ్ముధూళి అందులో పడుతోందని, అదే వంట విద్యార్థులకు వడ్డిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈపాఠశాలలో ఉర్దూ పాఠశాల కూడా కొనసాగుతుండటంతో పాఠశాలలో ఉండే వంట గదిని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు వండేందుకు వినియోగిస్తున్నారు. ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు వంట గది లేక ఇలా ఆరుబయటే వండాల్సి వస్తోంది.

దుద్దేకుంటలో జలధి పూజ







దుద్దేకుంటలో కలశాలను తీసుకొస్తున్న పూజారులు , అలంకరణలో ఆంజనేయస్వామి, సీతారామ లక్ష్మణులు

బొమ్మనహాళ్: మండలంలోని దుద్దేకుంటలో ఆంజనేయ స్వామి, దుగ్గెమ్మ ఆలయాల్లో ఘనంగా జలధి పూజ శనివారం నిర్వహించారు. భక్తులు పెన్నా పరివాహకం వద్ద గంగపూజ నిర్వహించి, పూజారులు జలాన్ని కలశాలల్లో తీసుకొచ్చి గ్రామంలోని ఆలయాల్లో మూలవిరాట్‌లకు పూజలు చేశారు. ఆలయం వద్ద పూజారులు పూనకంతో రైతులకు పంటల దిగుబడులపై భవిష్యవాణిని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురుస్తాయని, దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని పూజారులు తెలియజేశారు.

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు అంజన్నకు శనివారం అభిషేకం నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ఆలయ కమిటీ అన్నదానం చేసింది.

సీతారామస్వామి ఆలయంలో విశేష పూజలు



వజ్రకరూరులో అలంకరణలో జనార్దన వేంకటేశ్వరస్వామి

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించా రు. ఆలయంలో స్వా మికి ప్రత్యేక పూజలు, అర్చనలు, తీర్థ ప్రసాదాల వినియోగం తదితర పూ జలు చేశారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ శనివారం సాయంత్రం పూజలు చేశారు.

కోదండరామాలయంలో పూజలు

కూడేరు: కూడేరులోని కోదండరామాలయంలో శనివారం పూజలు నిర్వహించా రు. ఆలయ అర్చకుడు భాస్కర్ శర్మ సీతారామలక్ష్మణ, ఆంజనేయ మూలవిరాట్‌కు తొలుత క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని సీతారాములను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రణాళిక లోపంతోనే హెచ్చెల్సీకి ఆలస్యంగా నీరు

- రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు



నాగేపల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: హెచ్చెల్సీ మరమ్మతు పనులు ఆలస్యంగా చేయడంతోపాటు నిర్దిష్ట ప్రణాళిక లేకనే ఆలస్యంగా నీరు తీసుకునే దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. శనివారం మండలంలోని నాగేపల్లి గ్రామ శివారులో 155 కిలోమీటరు వద్ద బ్రిడ్జి పనులను మెట్టు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్చెల్సీ మరమ్మతు పనులను సకాలంలో చేసే విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆధునికీకరణ పనుల టెండర్లు, అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఈపాటికి పనులు పూర్తయ్యేవన్నారు. తుంగభద్ర డ్యాం పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసి, డ్యాం నిండుకుండలా మారి క్రస్ట్ గేట్ల ద్వారా యేటికి (నది దిగువన) రోజూ 30 వేల క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్తున్నా హెచ్చెల్సీకి నీరు తీసుకోలేకపోవడం బాధాకరమన్నారు. కర్ణాటక ప్రభుత్వం 10న హెచ్చెల్సీకి నీరు విడుదల చేయించుకుంటే ఏపీ ప్రభుత్వం నీటిని తీసుకునేందుకు మరికొన్ని రోజులు బ్రేక్ వేయడం దురదృష్టకరమన్నారు.

సెంట్రింగ్‌కు ప్రత్యామ్నాయంగా వేసిన మట్టి ఎలా తొలగిస్తారు?

హెచ్చెల్సీ నీరు ముందుకు సాగాలంటే ప్రతి బ్రిడ్జి కింద వేసిన మట్టి తొలగించాల్సి ఉందన్నారు. 21 రోజులు క్యూరింగ్ కాకుండా సెంట్రింగ్‌కు ప్రత్యామ్నాయంగా వేసిన మట్టిని ఎలా తొలగిస్తారని ఆయన అధికారులను మెట్టు ప్రశ్నించారు. యర్రగుంట శివారులో 136 కిలో మీటర్ వద్ద యూటీ (అండర్ టన్నెల్) శిథిలావస్థలో ఉందని, దీన్ని ఎమర్జెన్సీ కింద కొత్త యూటీ నిర్మించాల్సి ఉంటే ఇది కాకుండా 137 కిలో మీటర్ వద్దనున్న యూటీ పనులు చేయడాన్ని మెట్టు తప్పుబట్టారు. ఈఏడాది 136 కిలోమీటర్ యూటీకి ఏదైనా ప్రమాదం వాటిల్లితే దానికి బాధ్యులెవరని ఆయన ప్రశ్నించారు. ముందుచూపు కొరవడటం, పక్కా ప్రణాళిక లేక పోవడంతో ఆయకట్టు రైతులకు తీరని నష్టం జరుగుతోందన్నారు. జిల్లాలో ఖరీఫ్ ప్రారంభ సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు హెచ్చెల్సీ నీటిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. ఈ క్రమంలో నీటి విడుదల ఆలస్యమవుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి పాటిల్ చెన్నకేశవరెడ్డి, కణేకల్లు, గుమ్మగట్ట మండల కన్వీనర్లు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, కాంతారెడ్డి, రాయదుర్గం పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి హళ్లి నాగరాజు, నాయకులు యంత్రకాయల వన్నూరప్ప, కెంగుట రామిరెడ్డి, మురిడి మురళి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలేరి విజయలక్ష్మికి నేతల నివాళి



విజయలక్ష్మికి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి



నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి సతీమణి, మాజీ సర్పంచు ఆలేరి విజయలక్ష్మికి వైఎస్సార్‌సీపీ నేతలు నివాళులర్పించారు. శనివారం గరుడచేడు గ్రామంలో మాజీ ఎంపీపీ ఏఆర్ఆర్ స్వగృహంలో విజయలక్ష్మి వైకుంఠ సమారాధన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, గుంతకల్లు సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనేత వై.భీమిరెడ్డి విజయలక్ష్మి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉషారాణి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, పార్టీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, కణేకల్లు, బొమ్మనహాళ్,గుమ్మగట్ట మండల, రాయదుర్గం పట్టణ కన్వీనర్లు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులు, కాంతారెడ్డి, మేకల శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, వివిధ విభాగాల నేతలు శివ, మురిడి మురళి, హళ్లి నాగరాజు, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డితోపాటు పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉరవకొండ: కణేకల్లులోని రాజగోపాల్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విజయలక్ష్మి వైకుంఠ సమారాధనలో ఎంపీపీ నరసింహులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకెట్ల అశోక్, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీలు ఏసీ ఎర్రిస్వామి, సింగాడి తిప్పయ్య, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం పాల్గొన్నారు. విజయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

చెట్టు కొమ్మల నడుమ విద్యుత్ తీగలు



కణేకల్లు రోడ్డు ఎస్‌బీఐ ఎదురుగా రావి చెట్టుపై కొమ్మల నడుమ ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ఎదురుగా ఉన్న భారీ రావి చెట్టు కొమ్మల మధ్య ప్రధాన హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షం వచ్చిన సమయంలో పలు మార్లు చెట్టును తాకినప్పుడు షాక్‌కు గురవుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎస్‌బీఐ తోపాటు కమర్షియల్ దుకాణాలు, ఎస్‌బీఐ సేవా కేంద్రం, మీసేవా కేంద్రాలు ఉన్నాయి. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

పీఏబీఆర్ నీటితో చెరువులు నింపండి



కడదరకుంటలో ఎండిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

కూడేరు: పీఏబీఆర్ నీటితో చెరువులు నింపాలని సీపీఎం అనుబంధ సంఘం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీహెచ్ రాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శనివారం వారు కడదరకుంటలో పర్యటించారు. రైతులు నారాయణ, ఓబులేసు, లక్ష్మీనారాయణ పొలాల్లో ఎండుతున్న వేరుశనగ పంటను పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ వర్షాలు బాగా కురుస్తాయని రైతులు గంపెడు ఆశతో బోర్ల కింద అధికంగా పెట్టుబడి పెట్టి వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారన్నారు. ప్రభుత్వం , అధికారులు స్పందించి పీఏబీఆర్ డ్యాం నుంచి కుడి కాలువ ద్వారా ముద్దలాపురం, ఇప్పేరు చెరువులను నీటితో నింపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నేతలు కరీం సాబ్, ఈరప్ప, వెంకటేశులు, మల్లికార్జున, పెద్దన్న పాల్గొన్నారు.

పచ్చని చెట్లు నరికితే కఠిన చర్యలు

కుందుర్పి: గ్రామాల్లో ఇష్టారాజ్యంగా అటవీ శాఖ అనుమతి లేకుండా పచ్చని చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని జంబుగుంపల అటవీ బీట్ అధికారి పరమేశ్వరప్ప హెచ్చరించారు. శనివారం మొహర్రం జరుగుతున్న జంబుగుంపల, బసాపురం, ఎర్రగుంట పంచాయతీల్లో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై గ్రామాల్లో స్థానిక సిబ్బంది ప్రజలతో కలసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొహర్రం సందర్భంగా కేవలం ఎండిన చెట్లను మాత్రమే అగ్ని గుండాల్లో వేయాలని, పచ్చని చెట్లను నరకొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు అలిత, గంగాధర్, వన్నూర్‌రెడ్డి తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాపై దృష్టి సారించాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం మీదుగా గోవుల అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని విశ్వ హిందూ పరిషత్, గోరక్షక దళం సభ్యులు విన్నవించారు. శనివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మల్లికార్జున, గోరక్షక దళం కన్వీనర్ కేడిమి ప్రశాంత్‌యాదవ్, సనాతన హిందూ సేవా సమితి అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి వెంకటేశులు తదితరులు విలేకరులతో మాట్లాడారు.

దంత సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దు

కూడేరు: దంత సమస్యలు నిర్లక్ష్యం చేస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడాల్సి వస్తుందని దంత వైద్య స్పెషలిస్టు రాజేశ్వరి తెలిపారు. శనివారం కూడేరులోని పీహెచ్‌సీలో దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్పెషలిస్టు రాజేశ్వరి దంత పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల పంచాయతీ కెంచంపల్లి, బసాపురం, ఎర్రగుంట గ్రామ పంచాయతీల్లో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం భక్తులు పానకం దుత్తలతో పీర్ల చావిడికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచులు గంగాధర, బొమ్మయ్య, వన్నూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం గ్రామోత్సవం జలధితో మొహర్రం వేడుకలు ముగుస్తాయని సర్పంచులు తెలిపారు.

ఎట్టకేలకు కల్వర్టు నిర్మించారు !



ఇటీవల నూతన కల్వర్టును నిర్మించిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డు చికెన్ మార్కెట్ నుంచి చేపలవీధికి వెళ్లే మార్గంలో పూర్తిగా దెబ్బతిన్న కల్వర్టును ఎట్టకేలకు అధికారులు నిర్మించారు. నాలుగు నెలల క్రితం ఆ మార్గంలో కల్వర్టు ధ్వంసమైన ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ‘సాక్షి’లో ‘ప్రమాదకరంగా కల్వర్టు’ శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఇటీవల మున్సిపల్ సాధారణ నిధులతో కల్వర్టును నిర్మించారు.